నా మాట

ఈ పాయిదరువులు నవల చిన్నమ్మి అనే ఓ యానాది స్త్రీ బతుకుచిత్రం. నవల ఆరంభం నుండి చివరి వరకు ఆమె వారి అస్తిత్వం కోసం పోరాటం చేస్తూనే ఉంటుంది. ప్రధానంగా లింగాలగోడు అనే మేకపిల్ల చుట్టూ కథ ఉత్కంఠభరితంగా సాగుతుంది.

యానాది జీవన విధానంతో పాటు, మూగజీవాల బతుకుపోరు ముఖ్యంగా లింగాలగోడు, బొల్లిమేక, కుక్కలు పొట్టోడు, బూసేమ్మ పాత్రలు అలాగే.. చిన్నమ్మి, ఆనందుడు, పాపులమ్మ, రాజయ్య పాత్రలు చాలారోజుల మనల్ని వెంటాడుతాయి.

ఇక నవలలోని యానాది గుడిసెలు, ఆ గుడిసెలకు అనుకోని ఉన్న కౌండిన్య అడవి, దాపులే ఉన్న పల్లె మన కళ్లముందు బొమ్మకడుతాయి.

వాస్తవానికి నవలా వస్తువు యానాది జీవితమైనా! మేము ఈ జీవితాలతో మమేకమైయ్యే బతుకు సాగించాము కాబట్టే.. గడ్డ పెరుగులా నవల చిక్కగా వచ్చింది.

చిన్నతనం నుండి వారితోనే తిని, వారితోనే తిరగటం మూలంగా ఇవి వారి

మూలాల అనేకంటే మా మూలల్లోనుండి పుట్టుకొచ్చిందని సంతృప్తిగా చెప్పగ లను.

నవలలోని చిన్నమ్మిలో అచ్చం మా అక్క కనపడుతుంది.

పాపులమ్మ పాత్రలో మా అవ్వ కనపడుతుంది.

ఇక గర్వంగా చెప్పుకోవల్సింది మా వారి భాష, యాస. నవల ఆరంభం నుండి ముగింపు వరకు ప్రతిపదం, ప్రతి అక్షరం మా ఊరి భాషతో, మా పలుకు బడులతో, మా నానుడితో నిండిపోయి ఉంటుంది.

మాయీ మాండలీకంలో నవల రాసే ధైర్యాన్ని ఇచ్చింది మాత్రం మీరే.

2022లో ప్రచురించిన నా కలుంకూరి గుట్ట కథల్ని మీరెలా గుండెకెత్తుకున్నారో నేను ఎప్పటికీ మరచిపోలేను. ప్రాంతాలు, వర్గాలనే తేడా లేకుండా అక్కున చేర్చుకున్నారు. పైగా ప్రతిష్టాత్మకమైన 5 పురస్కారాలు కలుంకూరి గుట్ట పుస్తకం అందుకోవడం నాకు కొండంత ధైర్యాన్ని, భరోసాని కల్గించింది. ఆ భరోసానే ఇప్పుడు నన్ను 'పాయిదరువులు' నవల రాసేలా చేసింది. పైగా మనం బతికిన బతుకుని రికార్డు చేయాల్సిన అవసరం కూడా ఉందనిపించింది. అలా అనిపించ టానికి కారణం లేకపోలేదు.

బతుకుదేరువు కోసం కొన్నేళ్లపాటు ఊరినోదిలి బయటకొచ్చి ఉన్నపళంగా ఒకరోజు ఊరెళ్తే.. నన్ను కొత్తగా చూసిన తరుణం. ఈతరం పిల్లలు అయితే 'ఎవుర్నా నువు ఎవరింటికొచ్చినావు. వూరికి కొత్తగా వుండావు' అన్నారు.

ఆ రోజు నా మనసు 'ఖళుక్కు'మంది. 'నీనూ మీవూరొన్నేరాయబ్బా' అని ధైర్యంగా చెప్పలేకపోయాను.

ఇంకా కాలం గడిచే కొద్దీ.. మనల్నే కాదు. మన ఆచార, వ్యవహారాలు కాలంతో కొట్టుకుపోతాయనిపించింది.

తరువాత చాలారోజుల ఆలోచించాను. నేనేమి చేయగలను అని.

నేనేం చేయగలను మహా అయితే నాలుగు అక్షరాలు మాత్రం రాయగలను. ఏదేదో ఊహించి రాయటం కంటే మనం బతికిన బతుకునే ఎందుకు

రాయకూడదు అనే ఆలోచన నుండి పుట్టిందే కలుంకూరి గుట్ట కథలు.

కలుంకూరి గుట్ట మీచేత ఎంత ఆదరణకు నోచుకుందో.. మా ఊరి జనాలు కూడా 'మనూరి గురించి మన బతుకులు గురించి కథలు రాసినాడు ఈ పిలగోడు' అనేసి చెప్పుకున్నారు.

ఇక 'ఎవుర్నా నువు' అని ఆరోజు అన్నపిల్లలు ఈరోజు నా కలుంకూరి గుట్ట పుస్తకం చూసి 'ఈయన్న మాయన్న. మా మింద బుక్కులు గూడా రాసినాడు' అని గర్వంగా నలుగురికి చెప్పుకున్నారు.

నాపై మరింత బరువు, బాధ్యతను ఉంచారు. ఆ బరువు, బాధ్యతల నుండి పుట్టుకొచ్చిందే ఈ 'పాయిదరువులు' నవల. చదవండి.. చదివించండి.

ఈ నవలకి అవసరమైన కొన్ని విషయాల్ని అడిగిన వెంటనే స్పందించి చెప్పిన మా నేస్తగాడు చిన్నాగాడికి నా ప్రేమ. చిన్నాగాడు యానాది కుటుంబంలో పుట్టటం, వాడు నాకు అత్యంత సన్నిహిత మిత్రుడు కావటం నా అదృష్టం.

అడిగిన వెంటనే కాదు, కూడదు అనకుండా ముందుమాటకి ఒప్పుకున్న ప్రియ మిత్రుడు కేంద్రసాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు గారికి, పుస్తకం వేయాలి అనగానే ఫైల్ తీసుకొని పేజ్ సెటప్ చేసి పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్ది అట్టపైకూడా ఆప్త వాక్యాలు రాసిన మంచి రచయిత, జర్నలిస్టు ముని సురేష్ పిళ్లె గారికి, అద్భుతమైన ముఖచిత్రాన్ని గీసి ఇచ్చిన ప్రముఖ చిత్రకారులు నాగేశ్వర రావు గారికి, నా సాహిత్య ప్రయాణంలో నా వెన్నంటేవుంటూ మునుముందుకు వెళ్లేందుకు బాటలు వేసిన ఆప్తులు బాపురం నరహరిరావు గారికి హృదయ పూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు.

- కె.వి. మేఘనాథ్ రెడ్డి,
పలమనేరు.